క్లుప్తంగా

పీపీపీకి వ్యతిరేకంగా నేడు కోటిసంతకాల సేకరణ

తిరుపతి మంగళం: పీపీపీ పద్ధతిలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు తిరుపతి నాలుగుకాళ్ల మండపం వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొంటారని, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైద్యుల రిలే దీక్షలకు సంఘీభావం



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

చంద్రగిరి: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలంటూ గత నెల 30వ తేదీ నుంచి పీహెచ్‌సీ వైద్యాధికారులు చేస్తున్న దీక్షలకు గురువారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో సంఘీభావం తెలిపారు. వైద్యుల ఆందోళనపై ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని నిరసించారు.. కార్యక్రమంలో చంద్రగిరి పారా మెడికల్ సిబ్బంది, సూపర్‌వైజర్ వాసుదేవరెడ్డి, శ్యామల, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నూతన అధికారులకు సత్కారం



అధికారులను సత్కరిస్తున్న వెటర్నరీ వర్సిటీ యూనియన్ నేతలు

చంద్రగిరి: శ్రీవేంకటేశ్వర పశు వైద్య కళాశాలలో డీన్‌గా ఆర్వీ సురేష్ కుమార్, సీఏఈగా డాక్టర్ ఆదిలక్ష్మమ్మ, డీఎస్ఏగా డాక్టర్ వైకుంఠరావు కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. గురువారం కళాశాల టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాంబాబు, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ కవిత, సుష్మ, కుట్టి కుమార్, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన



విద్యార్థి వరదరాజన్‌ను సన్మానిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ అద్వైత వేదాంత విద్యార్థి వరదరాజన్‌ను వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి గురువారం ఘనంగా సన్మానించారు. శ్రీ కాంచి కామకోటి పీఠం, కాంచీ వేద వేదాంత శాస్త్ర సభ నుంచి వరదరాజన్ శర్మకు అద్వైత వేదాంత రత్న బిరుదు పొందడం వర్సిటీకి గర్వ కారణమని అభినందించారు. కార్యక్రమంలో శ్రీ పరమాచార్య గురుకుల కేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్ గణపతి భట్, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు



తిరుమల ఆలయం వెలుపల సినీ నటుడు కిరణ్ అబ్బవరం, దర్శకుడు జైన్స్ నాని

తిరుమల: సినీ నటుడు కిరణ్ అబ్బవరం, దర్శకుడు జైన్స్ నాని గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నగరంలో నేటి కార్యక్రమాలు

- శ్రీనివాసపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ. సాయంత్రం 6.30 గంటలకు పవిత్ర ప్రతిష్ఠ.
- ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉదయం 10 గంటలకు నాలుగు కాళ్ల మండపం వద్ద వైఎస్ఆర్‌సీపీ సంతకాల సేకరణ.
- టీటీడీ క్యాంటీన్ వద్ద కొత్త జాబిలి భవనంలో విశ్రాంత ఉద్యోగులకు శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదం పంపిణీ.

ఇన్‌చార్జ్‌ల పాలనతో అవస్థలు

- రెగ్యులర్ ఎంపీడీఓను నియమించని జిల్లా అధికారులు
- మండలంలో తిష్ట వేస్తున్న సమస్యలు
- మండల సర్వసభ్య సమావేశాల్లో నిలదీస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాకపోవడంతో గురువారం ఖాళీగా దర్శనమిస్తున్న ఎంపీడీఓ చాంబర్

చంద్రగిరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చంద్రగిరికి మండల స్థాయి అధికారులను నియమించకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బదిలీ చేసింది. అప్పటి నుంచి మండల కార్యాలయ ఏఓ శేఖర్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. అనంతరం మండలానికి ఈఓపీఆర్డీగా వచ్చిన వెంకటరత్నంను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అయితే వెంకటరత్నం వచ్చిన నాటి నుంచి సకాలంలో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండల సమావేశాలకు సైతం హాజరుకాకపోవడంతో సమస్యలకు పరిష్కరించే అధికారులెవరంటూ ఇటీవల సమావేశంలో ప్రజాప్రతినిధులు సైతం ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య రీత్యా విధులకు హాజరుకాకపోవడంతో వివిధ సమస్యలు నివేదించేందుకు వస్తున్న ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. గత 10 ఏళ్లలో ఎప్పుడూ మండల కార్యాలయాలకు ఇన్‌చార్జ్ అధికారులను నియమించిన దాఖలాలు లేవని, ఏడాదిన్నరగా జిల్లా అధికారులు ఎంపీడీఓను నియమించకుండా ఇన్‌చార్జ్‌లతోనే కాలం గడిపేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు రెగ్యులర్ ఎంపీడీఓను నియమించాలంటూ మండల ప్రజలు కోరుతున్నారు.

'యువ తరంగ్'లో తెలుగు భాషకు అవమానం..!

- వర్సిటీలను టీడీపీ కార్యాలయాలుగా మార్చారని విమర్శలు
- ఇది యువగళమేనంటూ విద్యార్థి సంఘాల ఆవేదన





యువతరంగ్‌పై నిప్పులు చెరుగుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో గురువారం నుంచి ప్రారంభమైన యువతరంగ్ కార్యక్రమంలో తెలుగు భాషకు అవమానం జరిగిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎల్ఎస్ఏ నాయకులు విమర్శించారు. యువతరంగ్–2025 పేరుతో వర్సిటీలో ఆర్భాటంగా ప్రారంభించిన మూడు రోజుల కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, నిర్వాహకులు బ్యానర్లు, ఆహ్వాన పత్రికల్లో కేవలం ఆంగ్లం, హిందీ భాషల్లోనే ముద్రించి తెలుగు భాషకు చోటివ్వకపోవడం బాధాకరమని మండిపడ్డారు. ఆ బ్యానర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన స్టేజ్ బ్యానర్లు, బెలూన్లు కూడా తెలుగుదేశం పార్టీ జెండా రంగులు, నారా లోకేష్ యువగళం కార్యక్రమాన్ని తలపించేలా అలంకరించడం దారుణమన్నారు. యువతరంగ్‌లో పాల్గొనే వలంటీర్లకు సైతం పసుపు రంగులో ఐడీ కార్డులు ఇచ్చారని నిరసించారు. వర్సిటీని టీడీపీ కార్యాలయంగా మార్చారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షుడు మస్నం ప్రేమ్ కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో–కన్వీనర్ అశోక్ కుమార్, నేషనల్ లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుందర్ మాట్లాడారు.

సప్లయ్ చానల్‌లో పూడికతీత



జేసీబీతో పూడిక తీయిస్తున్న వాసుస్వామి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలోని చిన్నగొట్టిగల్లు పెద్ద చెరువుకు వచ్చే సప్లయ్ చానల్ పూడిపోయి వర్షపు నీరు రోడ్డుపై వృథాగా పోతుండడంపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకున్నా చిన్నగొట్టిగల్లు పూజారి వాసుస్వామి స్పందించారు. తానే స్వచ్ఛందంగా పూడికతీత పనులకు పూనుకున్నారు. చెరువు నిండితే ఊరు బాగుంటుందనే సంకల్పంతో ఈ పనులు చేస్తున్నట్టు చెప్పారు.

● హతవిధీ..

రోడ్డును తవ్వేశారు!

- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



శివజ్యోతి నగర్ నుంచి తూర్పు ప్రాంతాన్ని కలిపే రోడ్డును జేసీబీతో తవ్వేసిన దృశ్యం

తిరుపతి తుడా: ప్రజల అవసరాల కోసం గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ తీర్మానంతో ఏర్పాటు చేసిన రహదారిని అడ్డంగా తవ్వేశారు. రాకపోకలకు వీలు లేకుండా జేసీబీతో రోడ్డును తవ్వేయడంతో స్థానికులు మండిపడుతున్నారు. శివజ్యోతి నగర్‌కు తూర్పు వైపున పలు కాలనీలను కలుపుతూ ఈ రోడ్డును అప్పట్లో వేశారు. దీనిని అడ్డంగా తవ్వేయడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఆదిశేషారెడ్డి నగర్ మీదుగా అయ్యప్ప కాలనీ జీవకోన ప్రాంతాలను కలిపేందుకు వేసిన రోడ్డు తమ సొంత స్థలం అంటూ కొందరు తవ్వేశారు. నగరపాలక సంస్థ అధికారులు దీనిని పట్టించుకోకపోవడం గమనార్హం!

'యువజన' సమావేశం

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా అధ్యక్షతన గురువారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితోపాటు యువజన విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షులు ఉదయ్ వంశీ పాల్గొన్నారు. యువజన విభాగం కమిటీల పురోగతి తదితర అంశాలపై చర్చించారు.



జక్కంపూడి నిర్వహించిన సమావేశంలో భూమన అభినయ్‌రెడ్డి, ఉదయ్‌వంశీ

రుయాలో ప్రపంచ అనస్తీషియా డే



అనస్తీషియా వైద్యులను సన్మానిస్తున్న రుయాదేవి ఆస్పత్రి యాజమాన్యం, డాక్టర్లు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో ప్రపంచ అనస్తీషియా డేను గురువారం ఘనంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ జే.రాధ మాట్లాడుతూ, అనస్తీషియా అనేది ఆపరేషన్ సమయంలో రోగులకు నొప్పిని తాత్కాలికంగా అరికట్టే వైద్య ప్రక్రియ అని, ఇది శస్త్ర చికిత్సల సమయంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ పద్మ, అసిస్టెంట్ అసోసియేట్ ప్రొఫెసర్లు, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్, యూజీ, పీజీ వైద్య విద్యార్థులు, వైద్యులు, రోగులు పాల్గొన్నారు.

రమాదేవి ఆస్పత్రిలో..

తిరుపతి తుడా: స్థానిక రమాదేవి ఆసుపత్రిలో ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనస్తీషియా ప్రాముఖ్యతను రోగులకు, సహాయకులు వివరించారు. అనంతరం అనస్తీషియా వైద్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ కిశోర్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌కు దిక్సూచి ఎన్ఈపీ



వీసీని సత్కరిస్తున్న ఏబీఆర్ఎస్ఎం ప్రతినిధులు

తిరుపతి సిటీ: వికసిత్ భారత్‌కు దిక్సూచి నూతన జాతీయ విద్యా విధానమని ఎస్వీయూ వీసీ నర్సింగరావు అన్నారు. వర్సిటీలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘం (ఏబీఆర్ఎస్ఎం) ప్రతినిధులు జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంతా లక్ష్మణ్ ఆధ్వర్యంలో వీసీని కలిసి అభినందించారు. వీసీ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాన్ని పరిశోధన, విద్య ,ఉపాధి, నైపుణ్యం మొదలైన విషయాల్లో అత్యున్నత స్థాయికి తీసుకు వెళ్లడానికి అందరి సహాయ సహకారాలతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ ఏం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవీ.రామిరెడ్డి, కోశాధికారి ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, ఇంజినీరింగ్ విభాగం కార్యదర్శి డాక్టర్ ఎస్.బాలసుబ్రమణ్యం, టీటీడీ విద్యాసంస్థల కన్వీనర్, ఎస్వీడబ్ల్యూ పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.పద్మావతమ్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ జీవీ.రమేష్ బాబు, ఇంటర్మీడియెట్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రియవర్ధనబాబు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ వీసీని కలిసిన వారిలో ఉన్నారు.

నివాళి..ఆర్థిక సాయం



నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి రఘునాథ రెడ్డి, సర్పంచ్ తదితరులు

చంద్రగిరి: మండలంలోని అగరాల పంచాయతీకి వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త షేక్ జైలావుద్దీన్(70) గురువారం హఠాన్మరణం చెందారు. ఇది తెలుసుకున్న చెవిరెడ్డి రఘునాథ రెడ్డి, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ దేవారెడ్డి తదితరులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, గ్రామంలోని పార్టీనేత టైలర్ బాబు కుమారుడు షేక్ కిరణ్ బాషాకు మెదడులో రక్తం గడ్డకట్టడంతో చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అవిలాల చెరువు పునరుద్ధరణ పనుల పరిశీలన

తిరుపతి తుడా: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) మార్గదర్శకాల మేరకు అవిలాల చెరువు పునరుద్ధరణ పనులను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి గురువారం పరిశీలించారు. తిరుపతి పరిసర ప్రాంతాలకు ముఖ్యమైన నీటి వనరుగా ఉండడంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం, ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో, అభివృద్ధి పనులను అధికారులు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, తుడా కార్యదర్శి, ఉద్యానవన శాఖాధికారులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంప్ ఎస్వీడబ్ల్యూ



విజేతలుగా నిలిచిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ అంతర్ కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలలో పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ విద్యార్థులు ప్రతిభ చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారిణులకు గురువారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. కళాశాలలో విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్న కారణంగా ఎంతో మంది విద్యార్థినులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. ఎస్వీయూ నిర్వహించిన బాస్కెట్ బాల్, ఖో–ఖో, టేబుల్ టెన్నిస్ (సింగిల్స్ అండ్ డబుల్స్), టెన్నికాయిట్ పోటీలలో విన్నర్స్, బాల్ బ్యాడ్మింటన్ (సింగిల్స్ అండ్ డబుల్స్), కబడ్డీ, చెస్ పోటీలలో రన్నర్స్‌గా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, క్రీడాకారిణులు పాల్గొన్నారు.

బంజారా బర్సి ఉత్సవాలను జయప్రదం చేయండి

తిరుపతి కల్చరల్: మండలంలోని వేదాంతపురం వద్దనున్న హథీరాం బావాజీ ఆలయంలో శుక్ర, శనివారాల్లో హథీరాం బావాజీ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, బర్సి ఉత్సవాలకు జిల్లాలోని బంజారాలందరూ పాల్గొని జయప్రదం చేయాలని హథీరాం బావాజీ ఆలయ చైర్మన్ శివ నాయక్, బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణనాయక్ ఒక ప్రకటనలో కోరారు. శనివారం ఉదయం 7.30 గంటలకు అభిషేకం ,8.30 గంటలకు హోమం, 10.30 గంటలకు స్వామివారి భోగ్ బండార్ పూజ, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ,సాయంత్రం 5 గంటలకు ఆలయం నుంచి గాంధీ రోడ్డు హథీరాం మఠం వరకు శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. అలాగే మఠంలో భోగ్ పూజ అనంతరం సాధుసంతులకు సన్మానించనున్నట్టు తెలియజేశారు.

బస్టాండ్‌లో పడిగాపులు

తిరుపతి జిల్లా నుంచి 325 ఆర్టీసీ బస్సులను కర్నూలులో పీఎం నరేంద్ర మోదీ సమావేశానికి తరలించారు. దీంతో తిరుపతి బస్టాండ్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు బస్సుల కోసం వేచి పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొనడంతో ప్రయాణికులు ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. పిల్లలతో వచ్చినవారు, వృద్ధులు అవస్థలు పడ్డారు.

\- తిరుపతి అర్బన్



బస్సుల కోసం తిరుపతి బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కోర్టులో చెవిరెడ్డిని కలిసిన చంద్రగిరి నేతలు







విజయవాడ ఏసీబీ కోర్టు వద్ద చెవిరెడ్డిని కలిసిన చంద్రగిరి నియోజకవర్గ పార్టీ నేతలు, కనక దుర్గమ్మను ప్రార్థించి వెలుపలికి వస్తున్న తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల నేతలు, ఏసీబీ కోర్టు సమీపంలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డితో పాకాల, చిన్నగొట్టిగల్లు మండల నేతలు

- బెయిల్ రావాలని దుర్గమ్మకు మొక్కులు
- పార్టీ శ్రేణులతో మాట్లాడిన చెవిరెడ్డి

తిరుపతి రూరల్: అక్రమ మద్యం కేసులో 120 రోజులుగా జైలులో నిర్బంధానికి గురైన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని పాకాల, తిరుపతి రూరల్, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు మండలాల పార్టీ నేతలు కలిశారు. గురువారం జైలు నుంచి విజయవాడ ఏసీబీ కోర్టుకు హాజరైన చెవిరెడ్డిని వీరంతా కలిసి కొంతసేపు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు.

బెయిల్ రావాలని..

చెవిరెడ్డికి బెయిల్ మంజూరు కావాలని తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల నాయకులు విజయవాడ శ్రీ కనకదుర్గమ్మను మొక్కుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలను చెవిరెడ్డికి అందజేశారు. విచారణ శుక్రవారానికి వాయిదా వేయడంతో నిరాశతో వెనుదిరిగారు.

జడివాన..!

- కలుజు పారిన తొండమనాడు చెరువు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గురువారం జడివాన కురిసింది. ఉదయం నుంచి వర్షం ఆగి..ఆగి పడుతుండడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామీణ వీధులు బురద గుంతలను తలపించాయి. వర్షాలకు రైతులు రబీ సీజన్ సాగుబడికి సన్నద్ధమవుతున్నారు. వర్షానికి శ్రీకాళహస్తి మండలం తొండమనాడు చెరువు పొంగి కలుజు పారింది. -ఏర్పేడు



కలుజు పారుతున్న తొండమనాడు చెరువు